ప్రజాశక్తి

గురువారం 10 ఏప్రిల్ 2025 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

వేగం పుంజుకున్న రాజధాని పనులు



రైల్వే లైను ప్రతిపాదిత మ్యాప్


ప్రకాశం బ్యారేజీపై నూతన బ్రిడ్జి నమూనా

- అమరావతి పునర్ నిర్మాణ పనులకు త్వరలో ప్రధాని శంకుస్థాపన
- తాజాగా రూ.4285 కోట్లు విడుదల
- వెలగపూడిలో శాశ్వత నివాసానికి చంద్రబాబు శంకుస్థాపన
- కొత్త రైల్వే లైనుకు రెండు నెలల్లో టెండర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతి నిర్మాణం పనులు క్రమంగా వేగం పుంజుకుంటున్నాయి. తాజాగా హైదరాబాద్ నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు డిపిఆర్ సిద్ధం చేయాలని బుధవారం కేంద్ర ఉపరితల రవాణా శాఖ అధికారులను ఆదేశించింది. రాజధాని నిర్మాణంకు కేంద్ర ప్రభుత్వం తగిన స్థాయిలో నిధులను సమకూరుస్తుండటంతో టెండర్లను ఖరారు చేసి ఈనెలాఖారు కల్లా పనులు ప్రారంభించేందుకు సిఆర్‌డిఎ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 23 లేదా 24 తేదీల్లో రాజధాని పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అమరావతికి రానున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

2015 అక్టోబరు 22న అమరావతి రాజధాని నిర్మాణ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. దాదాపు నాలుగేళ్లపాటు వివిధ దశల్లో నిర్మాణాలు జరగ్గా 2019 మేనెలలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు ఐదేళ్లపాటు నిర్మాణాలు నిలిచిపోయాయి. 2024లో తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి అమరావతి పనులు మళ్లీ మొదలయ్యాయి. తాజాగా అమరావతికి కేంద్ర ప్రభుత్వం రూ.4285 కోట్లు విడుదల చేసింది. రాజధానిలో నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి 25 శాతం కేటాయించారు. కేంద్రం వాటా రూ.750 కోట్లు కలిపి మొత్తం రూ.4,285 విడుదల చేయడంతో పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. అమరావతిలో పనులు ప్రారంభమవుతున్నందున 25 శాతం నిధులు అడ్వాన్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని సిఆర్‌డిఎ కోరగా కేంద్రం ఈ మేరకు నిధులు విడుదల చేసిందని అధికార వర్గాలు తెలిపాయి.

సిఎం చంద్రబాబు ప్రతి 15 రోజులకు ఒక సారి సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం నిర్వహించి రాజధాని పనుల పురోగతిని సమీక్షిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం సిఆర్‌డిఎ 46వ అథారిటీ సమావేశం ఉండవల్లిలో జరిగింది. అమరావతి రాజధాని నిర్మాణం కోసం అవసరమైన మిగిలిన నిధులు వివిధ రూపాల్లో సమీకరించేందుకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు అనుమతిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా మిగిలిన అవసరమైన నిధులను వివిధ ఫైనాన్సియల్ ఇన్ స్టిట్యూషన్స్ ▶ 2లో

అపార్ట్‌మెంట్ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఓ అపార్ట్ మెంట్ నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఓ భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణంలో కూలిపనుల నిమిత్తం ప్రకాశం జిల్లా అద్దంకి నుంచి ఒక కుటుంబం వచ్చింది. వీరికి చెందిన చిన్నారులు గుంతలో పడి మృతి చెందగా యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని, మృతదేహాలను హుటాహుటిన వారి స్వస్థలాలకు తరలించారని తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.


గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ కట్టెల పొయ్యిపై వంట చేస్తు నిడమర్రులో నిరసనలో స్థానికులు

కట్టెల పొయ్యిపై వంటతో నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్, పెదనందిపాడు

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి మండలం నిడమర్రు, మండల కేంద్రమైన పెదనందిపాడులో నిరసనలు చేపట్టారు. నిడమర్రులో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ వినూత్నంగా నిరసన తెలపగా నాయకులు ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు కొంతమేర ధరలను తగ్గించిన కేంద్రం, ఎన్నికలయిపోయాగా భారాలు మోపుతోందని, మరోవైపు కార్పొరేట్ సంస్థలకు రూ.వేలకోట్ల రుణాలు రద్దు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు, ▶ 2లో

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు

రూ.45 వేల విలువ చేసే కిలోన్నర సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి

ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ బి.జనార్ధన్‌రావు, సిఐ ఎస్.రమేష్‌బాబు విలేకర్లకు బుధవారం వెల్లడించారు. పట్టణంలోని మారిస్ పేట, రేపల్లె రైలుగేట్ల సమీపంలో కొందరు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారనే సమాచారంతో సిఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో గోరంట్లకు చెందిన నందిపాటి రాజశేఖరరెడ్డి, మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన తమనంపల్లి అరుణ్ కుమార్, తెనాలి పట్టణంలోని చినరావూరు తోటకు చెందిన దాసరి ప్రకాష్‌బాబు ఉన్నారు. వీరినుంచి రూ.45 వేలు విలువ కలిగిన కిలోన్నర గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరైన రాజశేఖర్ రెడ్డి నాంపల్లిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి, స్నేహితులైన అరుణ్ కుమార్‌తో కలిసి తెనాలికి వచ్చి దాసరి ప్రకాష్‌బాబుని కలిశారు. ముగ్గురూ గంజాయి సేవిస్తూ, దాని విక్రయంపై చర్చింస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన సిఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు, కానిస్టేబుల్స్ పి.మురళి, కె.బాబురావు, ఎస్.జయకర్, ఎన్.శ్రీనివాసరా వును ఎస్పీ సతీష్ కుమార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు.. వెనక ముసుగుల్లో నిందితులు

త్వరలో పల్నాడు వాటర్ గ్రిడ్ పనులు

- మేకలగొంది వద్ద నిర్మాణం
- రూ.3200 కోట్లతో తాగునీటి పథకాలు
- పనులు దక్కించుకున్న నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ
- డిపిఆర్‌పై అధికారులతో మాచర్ల ఎమ్మెల్యే సమావేశం



ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1200 కోట్లతో పల్నాడు వాటర్ గ్రిడ్ నిర్మాణం నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గంలోని విజయపురిసౌత్ వద్ద ఉన్న మేకలగొంది నుంచి సాగర్ బ్యాక్ వాటర్‌ను లిఫ్ట్ ద్వారా తీసుకుని, ఫిల్డర్ చేసిన జలాలను మాచర్ల నియోజకవర్గంలోని శివారు గ్రామాలు సహా ఇతర 165 గ్రామాలకు అందించేందుకు సమగ్ర నివేదిక (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు-డిపిఆర్) సిద్ధమైంది. ఇప్పటికే టెండర్లు ప్రక్రియ పూర్తి చేసుకుని 45 రోజుల సర్వే అనంతరం పనులు ప్రారంభకానున్నాయి. ఈ నేపథ్యంలో మొదటి దశలో రూ.1200 కోట్లతో తాగునీటిని మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు అందించనున్నారు. రెండో దశలో దాదాపు రూ.2200 కోట్లతో పల్నాడు జిల్లా మొత్తం పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా నీరు అందించనున్నాను.

మొదటి దశలో10 మండలాలకు సాగర్ జలాలు

మాచర్ల నియోజకవర్గం పరిధిలోని విజయపురిసౌత్ వద్ద ఉన్న మేకలగొంది నుంచి సాగర్ జలాలను ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎత్తిపోసి, క్లోరినేషన్ ప్రక్రియ పూర్తి చేసిన శుద్ధ జలాలను పైపులైన్ ద్వారా మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని 9 మండలాలకు, పెదకూరపాడు నియోజకవర్గంలోని బెల్లంకొండతో కలిపి మొదటి దశ కింద 10 మండలాలకు నీరందించేందుకు పనులు చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన డిపిఆర్‌ను టెండర్లను దక్కించుకున్న నాగార్జున కన్స్రట్రక్షన్ కంపెనీ సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో దాదాపు మాచర్ల నియోజవర్గంలో వాటర్ పైప్ లైన్స్ అమర్చి శివారు గ్రామాలతో కలుపుకుని దాదాపు 165 గ్రామాలకు 150 ఓవర్ హెడ్ ట్యాంక్స్‌ను ఈ గ్రిడ్ కింద నిర్మించనున్నారు.

ఏడాదిలో మొదటి దశ పనులు పూర్తి

పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా సాగర్ నీటిని నియోజకవర్గంలోని ▶ 2లో

జగన్‌పై శ్రీధర్ విమర్శలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి రామగిరి పర్యటనకు జనాన్ని తరలించి బాధలో ఉన్న కుటుంబ పరామర్శకు రోడ్డు షోగా వెళ్లడం హాస్యాస్పదమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ.5.50 కోట్ల ఖర్చుతో పర్యటించిన జగన్.. బాధి కుటుంబానికి ఏం న్యాయం చేశారో ప్రకటించలేని అన్నారు. ఆయన పర్యటనలో ఆద్యంతం గందరగోళ పరిస్థితులే నెలకొన్నాయని, హెలీప్యాడ్ చుట్టూ ఉన్న బారికేడ్లను వైసిపి నాయకులు తోసేయడంతోపాటు అడ్డుకునేందుకు ప్రయత్నించి పోలీసులను సైతం తోసేశారని అన్నారు. పైగా పోలీసులపై జగన్ విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా జగన్ మాట్లాడిన జగన్ క్షమాపణ చెప్పాలన్నారు.

ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి బుధవారం వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్లు, కాల్వల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు.

హత్యా రాజకీయాలు ఇంకెన్నాళ్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నియోజకవర్గంలో ఇంకెంత కాలం హత్యారాజకీయాలు చేస్తావు పిన్నెల్లి? అంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహానికి గురయ్యారు. వెల్దుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాచర్ల రూరల్ మండలంలోని పశువేముల గ్రామంలో మామ, అల్లుడు మధ్య వివాదం నేపథ్యంలో జరిగిన హత్యను మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలను, పాలనాపరమైన అంశాలను ప్రస్తావించి విమర్శలు గుప్పించారు.



రాజధాని రోడ్డులో వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి- తాడేపల్లి: రాజధాని అమరావతి రోడ్‌లోనే ఉండవల్లి జామాయిల్ తోట వద్ద డబల్ లైన్ బ్రిడ్జిపై బుధవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వీధిలైట్లు లేకపోవడంతో కొంతకాలంగా ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేకసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. స్థానిక టిడిపి నాయకులు జొన్న శ్రీనివాసరావు స్పందనతో నెట్టకేలకు అధికారులు కదిలి బ్రిడ్జిపై వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి : మండలంలోని కొలకలూరు జెడ్పి పాఠశాల ఆవరణలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం 10 గంటలకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జి డాక్టర్ స్వర్ణలత తెలిపారు. తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్యశాల బృందం వైద్య సేవలు అందిస్తుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

డ్రగ్స్ నివారణపై వర్సిటీలో అవగాహన

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఎఎన్‌యు మహోత్సవం-2025 కార్యక్రమం బుధవారం జరిగింది. ఇందులో భాగంగా యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద 'ఎరాడికేషన్ ఆన్ డ్రగ్స్' అంశంపై ఇంజినీరింగ్ విద్యార్థినీ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈగల్ టీం ఎస్పీ కె.నగేష్‌బాబు హాజరై మాట్లాడారు. అన్ని విశ్వవిద్యాలయాలలో డ్రగ్స్‌ను నిర్మూలించడానికి ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశారన్నారు. డ్రగ్స్ వల్ల మన జీవితాలు నాశనం అవుతున్నాయని, వీటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, బాగా చదువుకొని మంచి అభ్యున్నతి సాధించాలని చెప్పారు. రెక్టార్ రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ ఈగల్ క్లబ్ మెంబర్స్ మీలోనే ఉంటారని, అను నిత్యం మీపై నిఘా ఉంటుందని, చెప్పారు. భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దుతామని విద్యార్థులతో ప్రొఫెసర్ ఎం.సురేష్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎరాడికేషన్ అండ్ డ్రగ్స్‌పై స్కిట్ నిర్వహించారు. సిఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపికష్ణ, డి.చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ సిహెచ్ రవికుమార్, కో-కన్వీనర్స్ డాక్టర్ యు.సతీష్, డాక్టర్ కె.చైతన్య, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బి.పూర్ణచంద్ర శేఖర్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ సునీత, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎమ్‌డి తౌసిఫ్ ఆహమ్మద్ పాల్గొన్నారు.

చేబ్రోలుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఇడి

ప్రజాశక్తి - చేబ్రోలు : ఘన వ్యర్థాలను రోడ్లపైన, బహిరంగ ప్రదేశాల్లో నేలపై వేయకుండా చెత్త సేకరణ చేసి, ప్రాసెస్‌చేస్తేనే చెత్తనుండి సంపద సృష్టి లక్ష్యం నెరవేరుతుందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొంతా అర్జునరావు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణలో భాగంగా బుధవారం చేబ్రోలు గ్రామపంచాయతిని రాష్ట్ర కార్యాలయం సిబ్బందితో కలసి ఆయన సందర్శించారు. తాగునీటి నిర్వహణ, డ్రైనేజీ సమస్య వివరాలను ఎంపిడిఒ ఎ ఉమాదేవిని అడిగి తెలుసుకున్నారు. క్లాప్‌మిత్రాలతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం చేబ్రోలులో చెత్త నుండి సంపద తయారుచేసే కేంద్రము (ఎస్ డబ్ల్యుపిసి షెడ్డు) నిర్వహణ పని తీరును పరిశీలించారు . పారిశుధ్య నిర్వహణ చెత్త నుండి సంపద సష్టి కోసం పంచాయితీలలో పూర్తిస్తాయి లో మెరుగైన మార్పులు తేవాలని వచ్చిన మార్పును చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రస్థాయిలో సమీక్ష లో ఆదేశించారని అన్నారు. దానిలో భాగంగా రాష్ట్ర స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటన చేపట్టామని, జిల్లా, మండల స్థాయి సిబ్బంది కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి, పనులు విజయవంతం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు అర్జునరావును సన్మానించారు. కార్యక్రమంలో చేబ్రోలు, పొన్నూరు ఇఒపిఆర్ అండ్ ఆర్డీలు టి ఉషారాణి, మల్లిఖార్జునరావు, ఎఇఆర్‌డబ్ల్యూఎస్‌పి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వ్యర్థాల నిర్వహణను పరిశీలిస్తున్న ఇడి బి.అర్జునరావు

తులసీ సీడ్స్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం: మండలంలోని తులసి సీడ్స్ కంపెనీని సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్‌రెడ్డి, సురేష్, కె.రమణ కుమార్, మండల వ్యవసాయాధికారి జె.వాసంతి బుధవారం తనిఖీ చేశారు. 16 లాట్ నంబర్లను ఎంపిక చేసి బీటీ విత్తనాల్లో గ్లైసిల్ జెన్యూవు ఉన్నదా? లేదా? అని పరీక్షించగా లేదని తేలిందని అధికారులు తెలిపారు. కంపెనీలోని అన్ని విభాగాలనూ తనిఖీ చేశామని, స్టాక్‌ను పరిశీలించామని చెప్పారు. కార్యక్రమంలో తులసి సీడ్స్ మేనేజర్ హనుమంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ సుభాని, వ్యవసాయ సహాయకులు హకీం పాల్గొన్నారు.



12న తెలుగు రాష్ట్రాల స్థాయిలో సినీ పాటలపోటీలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల పలనాడు ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ క్యాబినెట్ గెస్ట్ చుండూరు వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆయరన విలేకర్లతో మాట్లాడారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండవ బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు, కన్సోలేషన్ బహుమతులు ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున అందజేయనునట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన గాయని గాయకులకు ప్రోత్సాహక బహుమతి రూ.300 ఇస్తామన్నారు. స్థానిక మానుకొండ కళ్యాణ మండపం ఆవరణలో పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఎంపిక కార్యక్రమంలో ఆర్కెస్ట్రా సహకారంతో ఒక సాంగ్ పాడాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పాల్గొంటారని, పర్యవేక్షణగా పాస్ట్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యక్రమ వ్యాఖ్యాతులుగా కుర్రి సాయిమార్కొండరెడ్డి, పీవీ నరసరాజు వ్యవహరిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440835472,9849065882 సంప్రదించాలని సూచించారు.



ఇంటి నిర్మాణ శంకుస్థాపనలో చంద్రబాబు కుటుంబం

వేగం పుంజుకున్న రాజధాని పనులు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి సమీకరించేందుకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు ఆమోదం తెలిపిన అథారిటీ ఎల్ వన్‌గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ అంగీకార పత్రాలు ఇచ్చేందుకు ఆమోదముద్ర వేశారు. అసెంబ్లీ నూతన భవనాలకు బేస్ మెంట్ నుంచి మూడు అంతస్తుల భవనం 11.22 లోల చదరపు అడుగులు, ఎత్తు 250 మీటర్ల తో అసెంబ్లీ నిర్మాణం చేపట్టేందుకు టెండర్లు ఖరారు చేశారు. హైకోర్టు బేస్‌మెంట్‌తో పాటు ఏడు అంతస్తుల్లో నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 20.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎత్తు 55 మీటర్లుగా నిర్మించేందుకు టెండర్లు ఖరారు చేసేందుకు సిఆర్‌డిఎకు అనుమతి ఇచ్చారు. వీటితో పాటు రైతులకు రిటర్నబుల్ ప్లాట్స్ త్వరగా ఇచ్చేలా పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం రూ.15 వేల కోట్లతో పనులు చేపట్టనున్నారు. రాజధాని నిర్మాణంలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయింపు ఒక కీలక ఘట్టంగా చెబుతున్నారు. రాయపూడిలో సిఆర్‌డిఎ కార్యాలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. రూ.69 కోట్లతో 3.62 ఎకరాల్లో నిర్మాణం చేపట్టారు.

సిఎం నివాసానికి శంఖుస్థాపన

అమరావతి రాజధానిలోని వెలగపూడిలో సీఎం చంద్రబాబు నాయుడు తన ఇంటి నిర్మాణానికి బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేయగా చంద్రబాబుతో పాటు ఆయన భార్య భువనేశ్వరి, నారా లోకేష్ దంపతులు పాల్గొన్నారు.

పట్టాలపైకి అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టు

అమరావతి రైల్వే లైనుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. రెండు నెలల్లో ఈపిసి విధానంలో టెండర్లు ఖరారు చేయనున్నారు. మొదటి దశలో ఎర్రుపాలెం నుంచి నంబూరుకు వయా వడ్డమాను మీదుగా రైల్వేలైను నిర్మాణం చేయనున్నారు. ఇందుకోసం రాజధాని గ్రామాలకు అనుసంధానం చేస్తూ కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు.

త్వరలో పల్నాడు వాటర్ గ్రిడ్ పనులు

(మొదటి పేజీ తరువాయి)

మారుమూల గ్రామీణ ప్రాంతాలకు, తండాలకు కుళాయిల ద్వారా ఇంటింటికీ అందజేయలనే ఉద్దేశంతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా స్థాయి అధికారులతో స్థానిక కేసీపీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం సమావేశమయ్యారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే 33 వాటర్ ఓవర్ హెడ్ ట్యాకులు ద్వారా తాగునీరు అందుతోంది. ఈ క్రమంలో పైపులైన్ పనులు పూర్తి చేసి, అదనంగా వాటర్ గ్రిడ్ కింద 150 వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంది. దీనిపై కాంట్రాక్ట్ సంస్థ డిపిఆర్‌ను ఎమ్మెల్యే పరిశీలించి సందేహాలపై అధికారులతో మాట్లాడారు. మరో 45 రోజులు సర్వే అనంతరం పనులు ప్రారంభం అవుతాయని, అందుకు అనుగుణం పేపర్ వర్క్, ఫీల్డ్ వర్క్ జరుగుతోందని ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కళ్యాణ్ చక్రవర్తి, పల్నాడు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు విజయకుమార్, మాచర్ల, పిడుగురాళ్ల డిఇలు కాశీరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, మాచర్ల, రెంటచింతల, దుర్గి, వెల్దుర్తి, మాచవరం మండలాల ఎఇలు నరేంద్రరెడ్డి, వెంకటేష్, గోపాల్ సింగ్ నాయక్, బాబు నాయక్, సురేష్ పాల్గొన్నారు.

కట్టెల పొయ్యిపై వంటతో నిరసన

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగులకు సరైన ఉపాధి కల్పించకపోగా ఈ భారాలేమిటని ప్రశ్నించారు. పెదనందిపాడులో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు మాట్లాడుతూ జనం ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు చార్జీల భారం భరించలేక సతమతమవుతున్నారని, పెంచిన ధరలను సత్వరం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాంల్లో నాయకులు ఎం.మంకమ్మరావు, ఎం.కోటేశ్వరరావు, కె.సరళ, పి.ఎలిశమ్మ, ప్రమీల, ఎం.వెంకటేశ్వర్లు, ఎ.ఆశీర్వాదం, జె.రామారావు, కె.వెంకట సుబ్బారావు, ఫణిదపు భువనేశ్వరి, షేక్ షమ్మి, బాలాజీ పాల్గొన్నారు.



పెదనందిపాడులో సిపిఎం నిరసన

దారిదోపిడి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి తెనాలి

ఆటో ప్రయాణీకుడిని అటకాయించి సెల్ఫోన్, నగదు కాజేసిన ఘటనలో ఇరువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మైనర్ కూడా ఉన్నారు. డిఎస్పి బి జనార్ధన రావు స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో వెల్లడించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం అంగల కుదురుకు చెందిన చుండి సుధాకర్ రావు వికలాంగుడు. గతంలో ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో పనిచేసే రిటైర్ అయ్యాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 5న రాత్రి కావలి వెళ్లేందుకు తెనాలి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి, సీఐ

అయితే వికలాంగుల కోటాలో రైల్వే కన్సెషన్ పాస్ మరిచిపోయిన నేపథ్యంలో ఆటో ఎక్కి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఆ సమయంలో ఆటోలో ఉన్న చినరావూరు తోటకు చెందిన నంబూరి గణేష్ అలియాస్ నాని, గుత్తికొండ నాగ రాకేష్ అలియాస్ రాకేష్(బాల నేరస్తుడు) కలిసి ఆటోను ఎరువుల కొట్టు బజారులోకి తీసుకువెళ్లిన తర్వాత బాధితుడు జేబులో ఉన్న సెల్ ఫోన్, నగదును లాక్కొని, అతనిని ఆటో నుంచి కిందికి నెట్టి పారిపోయారు. బాధితుడు ఈనెల 6న పోలీసులను ఆశ్రయించడంతో ఏఎస్ఐ మురళి కేసు నమోదు చేశారు. వహాబ్ రోడ్ లో ఉన్న నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి నగదు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు డి.ఎస్.పి వెల్లడించారు. సమావేశంలో సీఐ ఎస్ రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశరావు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో మంగళగిరి విజయవాడ పాత జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లి ముగ్గురు రోడ్డుకి చెందిన బూదాల దాస్ (43) మృతి చెందాడు. మంగళగిరి నుండి తాడేపల్లి వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో దాస్ అక్కడ అక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించి, తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13 ఎకరాల మొక్కజొన్న దగ్ధం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మొక్కజొన్న పంట కోసిన తర్వాత ఖాళీ అయిన పొలంకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా పక్కనే ఉన్న రెండు రోజులలో పంట కోసేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పొలంలో ఆ నిప్పు రవ్వలు పడడంతో సుమారు 13 ఎకరాల పంట దగ్ధమైన ఘటన మండలంలోని గోళ్ళపాడు లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోళ్ళపాడు గ్రామానికి చెందిన రైతు బోడ్డపాటి చిన్నకోటయ్య, కుందురువారిపాలెం గ్రామానికి చెందిన రైతులు పుల్లం వెంకటేశ్వర్లు, జవ్వాజి వేణుబాబు, పుల్లెం ఏడుకొండలు, బండారు నరసింహారావు, బండారు ఆంజనేయులు, బత్తినేని అచ్చయ్య, కందుల సుబ్బారావుకు చెందిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ ఇంజన్ వచ్చిన పొలాల్లోకి వెళ్ళేందుకు వీలు పడలేదు.రెండు రోజులలో పంట చేతికి వచ్చి అప్పులు తీరుతాయనుకుంటే అంతలోనే ఇలా జరిగి సుమారు రూ.15లక్షల పంట నష్టం జరిగిందని రైతులు వాపోయారు. ప్రభుత్వమే తామను ఆదుకోవాలని రైతులు కోరారు. ఘటన స్థలానికి ఎస్ఐ సోమేశ్వర రావు, ఎఎస్ఐ నవరాజ్, విఆర్వో దాసు పరిశీలించారు.



టిడిపి కార్యకర్తపై వైసిపి నాయకుని దాడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో టీడీపీ కార్యకర్తపై వైసీపీ గ్రామ అధ్యక్షుడు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయపురిసౌత్ గ్రామ వైసిపి అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, టీడీపీ కార్యకర్త బట్లకుంట ప్రసన్న పక్క పక్కనే నివాసం ఉంటున్నారు. ప్రసన్న తన ఇంటి బయట ఊడుస్తుండగా రామిరెడ్డి తన ఇంటిలోకి చెత్త వస్తుందంటూ ప్రసన్న పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ప్రసన్న తలకు బలమైన గాయం కావడంతో విజయపురిసౌత్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రసన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రామిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు విజయపురిసౌత్ ఎస్ ఐ షేక్ మహమ్మద్ షఫీ తెలిపారు

మనస్థాపంతో బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - యడ్లపాడు

పై చదవులు వద్దన్నందుకు తీవ్ర మనస్తాపానికిగురైన బాలిక (17) ఎలుకల మందు తిని ఆత్మహత్య చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం సొలస గ్రామానికి చెందిన బాలిక 2వతేదీ ఎలుకల మందు తిని ఆత్మహత్య యత్నం చేసింది. గుర్తించిన కుటుంబసభ్యులు నరసరావుపేట వైద్య శాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బాలికను గుంటూరు వైద్యశాలకు తీసుకువచ్చారు. అయితే పరిస్థితి విషమించి బుధవారం సాయంత్రం మృతి చెందిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

108 టెక్నీషియన్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాలలో 108 అంబులెన్స్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ప్రత్యూష బుధవారం ఆత్మహత్యాయత్నం చేసింది. రూరల్ గ్రామం కఠెవరంకు చెందిన ఆమె నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఆమెను వైద్యశాలకు తరలించారు. తనను అంబులెన్స్ డ్రైవర్ హుస్సేన్ లైంగికంగా వేధిస్తున్నాడని, వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసినట్లు ఆరోపించింది. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

అర్హతున్న ఉపాధ్యాయుల్ని ప్రమోషన్ జాబిలో చేర్చాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) సీనియారిటీ జాబితాలో అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందర్నీ చేర్చాలని ఎపిటిఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నరసింహా రావు, రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు కోరారు. ఈమేరకు డిఇఒ సి.వి.రేణుకను బుధవారం ఎపిటిఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. డిగ్రీలో స్పెషల్ తెలుగు, బిఈడిలో తెలుగు మెథడాలజీ కలిగిన వారిని తెలుగు స్కూల్ అసిస్టెంట్ సీనియార్టీ జాబితాలో చేర్చాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. కార్యక్రమంలో తెలుగు ప్రమోషన్ కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలపై దశలవారీగా ప్రభుత్వాల భారాలు

గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వంట గ్యాస్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నరసరావుపేట స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్క్ వద్ద గ్యాస్‌సిలిండర్‌తో నిరసన తెలిపారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం సిలిండర్, పెట్రో ధరలను తగ్గించి ఓట్లు వేయించుకుందని, అధికారంలోకి వచ్చాక మళ్లీ దశల వారీగా ధరలను పెంచుతోందని విమర్శించారు. ప్రజలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తోందని, బడా పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత గ్యాస్ అంటూ ఊదరగొట్టినా అనేక షరతులతో ఉచిత గ్యాస్ అందకుండా పోతోందన్నారు. ప్రజలు, రైతులు, కార్మికులు గ్యాస్ సిలిండర్ కొనే పరిస్థితిలో లేరని, మళ్లీ కట్టెల పొయ్యి మీద వంట చేసుకునే దుస్థితికి వచ్చిందని అన్నారు. ప్రభుత్వాలు వేస్తున్న భారాలతో కూలినాలి చేసుకుని బతికే ప్రజలు అవస్థల పాలవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.శివకుమారి, టి.పెద్దిరాజు, కె.రామారావు, సయ్యద్ రబ్బాని, షేక్ మస్తాన్‌వలి, డి.సుభాష్ చంద్రబోస్, షేక్ ఖాసీం, ఎం.రాంబాబు పాల్గొన్నారు.



ఎప్పుడిస్తారో? ఎక్కడిస్తారో?

రేషన్ సరఫరాలో లోపాలపై విమర్శలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యంపై కార్డుదారుల నుండి అసంతృప్తి వ్యక్తమవుతోంది. వాహనం ఎప్పుడు వస్తుంది? రేషన్ ఎక్కడ ఇస్తున్నారు? అనేది తెలియడం లేదు. పట్టణంలో 44 రేషన్ దుకాణాలుండగా 18 ఎమ్‌డియు వాహనాల ద్వారా వాహనాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఒక్కో వాహనం పరిధిలో సుమారు మూడు రేషన్ దుకాణాలున్నాయి. వాహన ఆపరేటర్లలో కొంతమంది సరుకులు సరిగా పంపిణీ చేయడం లేదని, ఏదో ఒక వీధిలో ఒక మూలన బండిని నిలిపి సరుకులు ఇస్తున్నారని, ఈ విషయం అందరికీ తెలియక రేషన్ తీసుకోలేకపోతున్నారని కార్డుదారులు చెబుతున్నారు. కొన్ని వాహనాలైతే అసలు రావడం లేదని, డీలర్ల వద్దకెళ్లినా సరుకులు అయిపోయినట్లు చెబుతున్నారని అంటున్నారు. మొత్తంగా సగానికిపైగా ఎమ్‌డియు వాహనాలు సరిగా సరఫరా చేయడం లేదని, రేషన్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పైగా బియ్యం మాత్రమే ఇస్తున్నారని, పంచదార అడిగితే మినహా ఇవ్వడం లేదనే వాదనలున్నాయి. వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కార్డుదారులందరికీ సరుకులన్నీ అందేలా చూడాలని లబ్ధిదార్లు కోరుతున్నారు.

మృతుని నేత్రాలు దానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



తిరుపతయ్య (ఫైల్)

శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన అనమాల తిరుపతయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులను అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు సంప్రదించగా వారు మృతుని నేత్ర దానానికి అంగీకరించారు. దీంతో తిరుపతయ్య కళ్లను పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు సేకరించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ చనిపోయిన 6 గంటల్లోపు, ఫ్రీజర్‌లో పెట్టిన 10 గంటల్లోపు నేత్రాలను సేకరించవచ్చని, తద్వారా కంటి చూపు లేని ఇద్దరికి లోకాన్ని చూపించవచ్చని అన్నారు. మట్టిలో కలిసిపోయే శరీరాన్ని కళ్లను దానం చేయడం వల్ల మృతి చెందిన వారు బతికి ఉన్నట్లేనన్నారు. నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించిన మృతునికి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

5.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ, గనుల శాఖలకు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే వర్షాకాలం కోసం సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ కోసం ప్రభుత్వ సూచనల పై చర్చించారు. 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తీయాల్సి ఉందని చెప్పారు.



నిబంధనలు పాటించని హోటళ్ల లైసెన్స్ రద్దు

- పల్నాడు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీనారాయణ
- రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లు, హోటళ్లలో తనిఖీలు
- పరీక్షల కోసం పలు నమూనాల సేకరణ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



బిర్యానీ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, అల్పాహారశాలల నిర్వాహకులు తప్పనిసరిగా ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పల్నాడు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. నరసరావుపేట పట్టణంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లలో బుధవారం తనిఖీలు చేపట్టి శాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హోటళ్ల పరిసరాలు, వంట గది శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, లేకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. ఆహార పదార్థాల తయారీకి తాజా మాంసం, కూరగాయలు వినియోగించాలన్నారు. సిబ్బంది తలకు, చేతులకు, మూతికి మాస్కులు ధరించాలన్నారు. మిగిలిన ఆహార పదార్థాలు, మాంసాహారం ఫ్రిడ్జ్‌లో నిల్వ చేయడం, తిరిగి వినియోగించడం ఏ మాత్రమూ మంచిది కాదన్నారు. ఆహార పదార్థాలు రంగు, రుచి, సువాసన వెదజల్లడం కోసం టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వినియోగం ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరమన్నారు. తాము సేకరించిన నమూనాలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిస్తామని, నాణ్యతలో తేడా ఉన్నా, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వినియోగించినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు మీరే హోటళ్లపై క్రిమినల్ చర్యలకూ వెనకాడబోమన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం

వన్‌టౌన్ ఎస్ఐ అరుణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి మహిళ ఒక్క మహిళ ఫోన్లో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని వన్‌టౌన్ ఎస్ఐ అరుణ సూచించారు. నరసరావుపేటలోని సింధు స్కూల్లో విద్యార్థులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించడానికి శక్తి యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. పల్నాడు జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ, గృహిణులు విద్యార్థినులు, బాలికలు వారి యొక్క ఫోన్లలో ఈ యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలని, ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందాలని సూచించారు. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్ఒఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు డయల్ 112 నంబరుకు చేరుతుందని, వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పిస్తారని వివరించారు.



యాప్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్ఐ అరుణ

అధికారులు స్పందించకుంటే చర్యలు తప్పవు

- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- వచ్చిన 80 అర్జీల్లో భూ వివాదాలే అధికం
- తనకు తెలియకుండానే తన భూమిపై రుణం తీసుకున్నారని మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు స్పందించకుంటే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. వెల్దుర్తిలోని తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలపై అధికారులు స్పందించుకుంటే ప్రజలు నేరుగా తనను కలుస్తారని, ఆ తర్వాత సీరియస్ యాక్షన్ ఉంటుందని అన్నారు. ప్రాథమిక దశలోనే ప్రజా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 80 అర్జీలు అందగా వీటిల్లో భూకబ్జాలు, దందాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, అవినీతికి సంబంధించినవి ఉన్నట్లు చెప్పారు. వీటిపై నిర్ణీత సమయంలో విచారణ చేసి పరిష్కరిస్తామని బాధితులకు హామీనిచ్చారు. ఇదిలా ఉండగా కండ్లకుంట గ్రామంలో పిన్నెల్లి అనచరుడు, వైసిపి నాయకుడు అయిన మంగదొడ్డి రామాంజీ తన పొలాన్ని బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.4.50 లక్షలు తనకు తెలియకుండానే లోన్ తీసుకున్నారని విధుల శ్రీను అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ గత ప్రభుత్వ పాలనలో రెవెన్యూ శాఖ, బ్యాంక్ అధికారులు కుమ్మక్కై దాదాపు రూ.200 కోట్లు లూటీ చేశారని, రైతులు భూములపై వారికి తెలియకుండానే బ్యాంకుల్లో తాకట్టుపెట్టి రుణాలు తీసుకొని, పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేశామని, బాధితులకు త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మాణం కోసం భూములను సమీకరణకు అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - మాచర్ల

నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధిపై రెవెన్యూ అధికారులతో స్థానిక కేసీపీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే సమీక్షించగా ఆర్‌డిఒ మురళీకృష్ణ, తహశీల్దార్ కిరణ్, ఆర్ఐ, మండల సర్వేయర్లు హాజరయ్యారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రి, వాకింగ్ ట్రాక్‌తో కూడిన పార్క్, క్రీడా స్టేడియం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఒకే ప్రాంగణంలో అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా చేపట్టబోయే నూతన నిర్మాణాలకు అవసరమైన ప్రభుత్వ భూమిని సమీకరించాలని ఎమ్మెల్యే సూచించారు. మండల రెవెన్యూ ల్యాండ్ మ్యాప్‌ను పరిశీలించి, ప్రభుత్వ సర్వే నంబర్లను సమీక్షించారు. నూతన నిర్మాణాలకు అవసరమైన భూకేటాయింపుల్లో జాప్యం లేకుండా అనుమతులివ్వాలని ఆర్డీవోను కోరారు. నియోజకవర్గం నాలుగు దిక్కుల ఉన్న రెవెన్యూ భూములను సర్వే చేసి ప్రభుత్వ నూతన భవన నిర్మాణాలకు సహకరించాలని కోరారు.



మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వీధి కుక్కలకు ఎబిసి ఆపరేషన్లకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

వీధికుక్కలకు సంతాన నియంత్రణ, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ అత్యవసరమని, అందుకు జంతుప్రేమికులు కూడా సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జిఎంసి కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జంతు ప్రేమికులు, పశుసంవర్ధక శాఖ, జిఎంసి ప్రజారోగ్య శాఖ అధికారులతో ఏబిసి నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కల సంతాన నియంత్రణ, సంక్షేమానికి సుప్రీం కోర్టు జారీచేసిన మార్గదర్శకాలను పాటిస్తామన్నారు. నగరంలో వీధి కుక్కల సమస్యలపై ప్రజల నుండి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని, ఇటీవల ఇద్వా నగర్‌లో కుక్క దాడిలో ఐజాక్ అనే బాలుడు కూడా మతి చెందడం బాధాకరమన్నారు. ప్రస్తుతం నగరంలో పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం 35 వేలకు పైగా వీధికుక్కలు ఉన్నాయని, వీటికి ఏటుకూరు రోడ్డులో ఏబిసి చేస్తుండగా కొందరు జంతు ప్రేమికుల పేరుతో లేవనెత్తిన ఫిర్యాదుల మేరకు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందన్నారు. కేంద్రబందం పరిశీలన అనంతరం వారి సూచనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏబిసి ఆపరేషన్లు వెంటనే పునఃప్రారంభం చేయడానికి పశు సంవర్ధక శాఖ నుండి 5గురు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లను నియమించిందన్నారు. స్టెరిలైజేషన్ చేసిన కుక్కలను అదే ప్రాంతంలో వదిలేలా, చేసిన వాటికీ ప్రత్యేక ట్యాగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సదరు కార్యకలాపాలను జంతు ప్రేమికులు కూడా నేరుగా పరిశీలించవచ్చని, వారికి కొంత పారితోషికం కూడా ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జంతు ప్రేమికులు చెప్పిన అంశాలను, ఫిర్యాదులపై కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సమస్య పరిష్కారం చేసుకుంటూ, ఏబిసి నిర్వహణ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, పశుసంవర్ధక శాఖ నుండి డాక్టర్ చక్రవర్తి, ఈశ్వరరెడ్డి, జిఎంసి విఎఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జంతు ప్రేమికులు ప్రదీప్‌జైన్, తేజోవంత్, రాజ్యలక్ష్మీ, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడవ రోజుకు క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న సమ్మె బుధవారం నాటికి మూడో రోజు చేరింది. సమ్మె శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నెలకు రూ.12,500 తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని, అయినప్పటికీ రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. వేతనాలు చెల్లింపుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కనీసం నెలకు 24500 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 16 నెలలుగా ఈఎస్ఐ, వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ఐడి కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. ఆప్కాస్ లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె మూడు రోజులుగా జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కలగజేసుకొని వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు డి శివ, కార్యదర్శి ఎం రవి, యూనియన్ నాయకులు ఎం.యోహన్, జె శ్రీకాంత్, ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో ఉన్న క్లాప్ ఆటో డ్రైవర్లు

కష్టపడే తత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

కష్టపడేతత్వం, ప్రణాళికాబద్దంగా కృషి చేస్తే ఏపనిలోనైనా విజయం సాధించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం విజ్ఞాన మందిరంలో స్మార్ట్‌టెక్స్, జిఎంసి ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే మెగా జాబ్‌మేళాకు సంబంధించి రిజిస్ట్రేషన్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైజాగ్‌లో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆధ్వరంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారని, వారిని స్పూర్తిగా తీసుకొని జిఎంసి పరిధిలో కూడా జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేటు ఉద్యోగాల సాధన కోసం తగిన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.జాబ్‌మేళాలో సుమారు 50 కంపెనీలు పాల్గొని, 10 వేలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. ఇప్పటికే 2 వేల మందికిపైగా రిజిస్టర్ చేసుకున్నారని, ఇంకా రిజిస్టర్ చేసుకోదలచిన వారు సచివాలయాలలో ఏర్పాటు చేసిన క్యుఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకొని రిజిస్టర్ చేసుకొని, తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సదరు కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్లు డి. శ్రీనివాసరావు, టి. వెంకటకష్ణయ్య, సెక్రటరీ పి. శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజీ బాషా, స్మార్ట్ టెక్స్ సంస్థ ప్రతినిధులు దివ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర కమిషనర్

పెండింగ్ వేతనాలివ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ జీతం ఇవ్వాలని, పిఎఫ్, ఈ ఎస్ ఐ వెంటనే చెల్లించాలని హైకోర్టులో విధులు నిర్వర్తించే కార్మికులు విజ్ఞప్తి చేశారు.బుధవారం హైకోర్టు సమీపంలో జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ,హైకోర్టులో పనిచేసే కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించకుండా రెండో నెలాఖరిలో జీతాలు ఇవ్వడం సరికాదన్నారు.గత ఐదు నెలలుగా పిఎఫ్,ఈఎస్ఐ చెల్లించలేదని,వెంటనే పిఎఫ్,ఈఎస్ఐ చెల్లించాలని కోరారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, కార్మికుల జీతం మాత్రం పెంచడం లేదన్నారు. కార్మికులకు రూ 21వేలు జీతం ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థ రద్దుచేసి అసెంబ్లీ,సచివాలయ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి కార్యాక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - పెదకాకాని

రాష్ట్ర అభివద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం మండలంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత పెదకాకానిలోని శివాలయంలో 32 లక్షలతో దివిస్ లేబరేటరీ వారు ఇచ్చిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బోయపాటి రామమోహన్ నిత్యాన్నదానానికి ఇచ్చిన లక్ష రూపాయలు చెక్కును డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్ కు అందజేశారు. అనంతరం వెనిగండ్ల గ్రామానికి చేరుకొని వాటర్ ప్లాంట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి గ్రామ ప్రజల తాగునీటి విషయంలో శ్రద్ధ చూపించాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలలో నూతన ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన, సిసి రోడ్లను ప్రారంభించారు.

ఫిర్యాదులను స్వీకరించిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాల యంలో బుధవారం నాడు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజాదర్బార్ ను నిర్వహించారు. ప్రజలు మరియు పార్టీ నేతల నుండి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా మునిసిపాలిటిలో అవుట్ సోర్స్ ప్రాతిపదికన పనిచేసే పారిశుధ్య కార్మికులను తమ ప్రాంతానికి దూరంగా విధుల వేయటం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తమను యథాస్థానంలో ఉంచేలా చేయాలనీ ఎమ్మెల్యే ను కోరారు.అదేవిధంగా ఏపీ కుమ్మరి శాలివాహన కమిటి సభ్యులు "శాలివాహన చక్రవర్తి" విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ కోరుతూ వినతి పత్రం అందజేసారు. ప్రజలు తమ ప్రాంతాల్లో పలు సమస్యల గురించి వినతిపత్రాలు అందజేయగా వీటన్నిటి పరిశిలించి, త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామినిచ్చారు. తొలుత గుంటూరు కోరిటేపాడు రామాలయంలో శ్రీరాముల వారిని ఎమ్మెల్యే గల్లా మాధవి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

నోటి దురుసు తగ్గించుకోవాలి : ఎమ్మెల్యే

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వంటి నేతలు తమ నోటి దురుసు తగ్గించుకోవాలని ఎమ్మెల్యే మాధవి కోరారు. ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె బుధవారం టి.యన్.టి.యుసి నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి టి.యన్.టి.యుసి నేతలు తీసుకొని వెళ్ళారు. విద్యుత్ కార్మికుల సమస్యలను సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామినిచ్చారు.

12 నుంచి వైఎస్సార్ కళాపరిషత్ నాటిక పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి చతుర్ధ ఆహ్వాన సాంఘిక నాటిక పోటీలు ఈనెల 12 నుంచి నిర్వహించనున్నట్లు పరిషత్ నిర్వాహకులు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి వెల్లడించారు. స్థానిక లెక్చరర్స్ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నాటిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలకు, కళాకారులకు పుట్టిల్లు తెనాలిలో నాటిక పోటీలు నిర్వహణ అభినందనీయమన్నారు. లక్ష్మణ శాస్త్రి మాట్లాడుతూ స్థానిక రామలింగేశ్వరపేట ఓపెన్ ఆడిటోరియంలో నాటిక పోటీలు ప్రతిరోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని, ఈనెల 18 వరకు జరుగుతాయని, మొత్తం 11 నాటికలు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. వైయస్సార్ పురస్కారాన్ని రజక సంఘం నాయకులు పెసర్లంక రమణ, వైసిపి నాయకులు అత్తోట చంటికి, కందుకూరి వీరేశలింగం నాటకారంగ పురస్కారాన్ని భీమవరానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ రాయప్రోలు భగవాన్‌కు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిట్టు వెంకట కోటేశ్వరరావు, అక్కిదాస్ కిరణ్, కె హరీష్, దుబాయ్ బాబు, అత్తోట సర్పంచ్ నాగ పుణ్యశ్వరరావు, అలాగేతెనాలి కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు ఆరాధ్యుల కన్న, కోశాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


బ్రోచర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాకనం బుధవారం ముగిసింది. స్థానిక నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో ఈనెల 3వ తేదీన నుండి చేపట్టిన మూల్యాంకనం నిర్దేశిత షెడ్యూలు ప్రకారం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. వివిధ శాఖాధిపతులు, ఎంఇఒలు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, ఐటి సిబ్బంది, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది సమిష్టి కృషితో విజయవంతం అయ్యిందన్నారు.

అనధికార మాంసం వ్యర్థాల తరలింపుదారులపై చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో అనధికార మాంస వ్యర్థాల తరలింపుదారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు.బుధవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో చికెన్, మటన్‌షాప్‌ల అసోసియేసన్ ప్రతినిధులు, జిఎంసి అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టెండర్ ద్వారా వ్యర్థాల తరలింపు కాంట్రాక్ట్ పొందిన ఏజన్సీనే సోమవారం నుండి వ్యర్థాలను నిర్దేశిత విధానంలో సేకరిస్తుందని అన్నారు. రోడ్ల వెంబడి అనధికార చికెన్, మటన్, చేపల విక్రయాలు ప్రజారోగ్యం దష్ట్యా నిషేధించామన్నారు. ప్రజారోగ్య విభాగం నుండి అనధికార విక్రయాలు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణకు బందాలను ఏర్పాటు చేస్తామన్నారు. విక్రయదారులు నిర్దేశిత లైసెన్స్‌లు తీసుకోవాల్సిందేనని అన్నారు. సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, విఎఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌లు, చికెన్ స్టాల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కిషోర్ పాల్గొన్నారు.

న్యాయ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నియమ, నిబంధనలకు విరుద్ధంగా పుత్తూరులో కొనసాగుతున్న కేఎంఆర్ న్యాయ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ బుధవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో బుధవారం విద్యా మండలి చైర్మన్ మధు మూర్తిని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్, నాయకులు వినపత్రం అందజేసి కోరారు. అనంతరం డాక్టర్ నారాయణ గౌడ్ మీడియాతో మాట్లాడారు. సెక్షన్ 20 ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 ప్రకారం ఒక ఏరియాలో కొత్త కళాశాల కావాలనుకున్నప్పుడు ఉన్నత విద్యా మండలి పర్యవేక్షించిన తర్వాత అవసరాన్ని బట్టి పేపర్ నోటిఫికేషన్ ఇస్తారన్నారు. నిబంధనలు పాటించకుండా, యూనివర్సిటీ అనుబంధం లేకుండా చట్ట విరుద్ధంగా అక్రమ మార్గంలో కళాశాలను స్థాపించారని ఆయన విమర్శించారు. కళాశాలలో ఒకే భవనంలో నాలుగు కోర్సులు నిర్వహిస్తున్నారన్నారు. కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందిన లా విద్యార్థులను ఇతర కళాశాలలకు బదిలీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, నక్కా గోపీచంద్, సాయి, డాక్టర్ సునీల్, సూర్య, రవీంద్ర, దుర్గారావు, అశోక్, సాయి సురేంద్ర, రమేష్, పవన్ కుమార్ యాదవ్, మహేష్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి పట్టణ పరిధిలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలు కావస్తుందని, ఇంతవరకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలియజేస్తూ స్థానిక సిపిఎం నాయకులు బుధవారం కాలనీలో పార్కు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. అదేవిధంగా కాలనీ వద్ద బైపాస్ రోడ్డుకు ఇరువైపులా బస్ షెల్టర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఎం స్థానిక నాయకులు కే వెంకటేశ్వరరావు, బి స్వామినాథ్ పాల్గొన్నారు.

ఈపూరు తహశీల్దార్‌గా సురేష్ కుమార్

ప్రజాశక్తి-ఈపూరు



జిల్లా ఉన్నతాధికారులు ఈపూరు ఇన్చార్జ్ తహశీల్దార్‌గా సబావత్ సురేష్ కుమార్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈపూరు తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.నళిని ఈనెల 4న సెలవుపై వెళ్లడంతో వినుకొండలో పనిచేస్తున్న ఎస్.సురేష్ కుమార్ ఈపూరు అదనపు బాధ్యతలు చేపట్టారు.



విద్యార్థికి ఆర్థిక సాయం...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో మాచవరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి విద్యార్థి అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థి గర్నెపూడి ప్రేమకుమార్ లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. బుధవారం నాజ్ పౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్, గుంటూరు వారి తరపున బి.లాల్ అహమ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.నాగరాజు,మదన్ మోహన్ తదితరులు రూ 7 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ పెద్దలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.అబ్రహం, ఉపాధ్యాయులు ఎం.వి.నాగయ్య, రామాంజనేయులు, అంతయ్య, అచ్చయ్య, శారదా తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి - అమరావతి

నందూరి వెంకటస్వామి భౌతిక కాయంపై పల్నాడు జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు గింజ మాల రవిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. రవిబాబు మాట్లాడుతూ వెంకట స్వామి తండ్రి వెంకటేశ్వరరాజు సిపిఎం సభ్యుడుగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుగా అమరావతి మండల ప్రాంతంలో పనిచేశారన్నారు. ఆయన పెద్ద కుమారుడు వెంకటస్వామి కుటుంబ పోషణ కోసం ఆటోతో నడుపుకుంటూ జీవన సాగిస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు, ఎస్.డి. మోదిన్‌వలి, లక్ష్మణ్ తదితరులు నివాళులర్పించారు.



కలెక్టర్‌ను కలిసిన విద్యార్థి నాగరాజు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయపురి సౌత్ జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి పిల్లుట్ల వెంకట నాగరాజు యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్‌ను నాగరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పి.వెంకట నాగరాజును అభినందించి మరింత ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో జిల్లా విద్యా శాఖాధికారి చంద్ర కళ, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే

బేజారవుతున్న ప్రజలు

- ఎక్కడపడితే అక్కడ కార్ల పార్కింగ్
- సంచరిస్తున్న పాములు, గేదెలు
- వర్షం పడితే కంపు కొడుతున్న ప్రాంగణాలు



పార్కింగ్ చేసి వున్న జీపు, స్కూటీ, బైక్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు దుర్వాసనా కేంద్రాలుగా మారాయి. కనీసం ఆలనా పాలన లేక పాములు సంచరిస్తున్నాయి. దీనికి తోడు కార్లకు పార్కింగ్ స్థలాలు మారిపోయాయి. స్థానిక సబ్ ట్రెజరరీ కార్యాలయము, రెడ్ క్రాస్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ సముదాయాల పరిసర ప్రాంతాలే దీనికి ఉదాహరణ. దీంతో నిత్యం ప్రభుత్వ పనుల కోసం వచ్చే ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఈ కార్యాలయాల చుట్టూ యూరినల్స్, ఆవులు పేడ వేసేందుకు, పశువులు పడుకునేందుకు అనువైన స్థలాలుగా మారాయి. అడ్డరోడ్ సెంటర్ నుంచి గడియార స్తంభం వరకు ఎక్కడ యూరినల్స్‌కు అనువైన స్థలం, సౌకర్యాలు లేవు. దీంతో ఎక్కడెక్కడ నుంచో వచ్చే వారికి ఈ కార్యాలయ సముదాయమే శరణ్యము.. ఉన్న యూరినల్స్, లెట్రిన్స్ రూమ్స్‌కు సక్రమంగా తలుపులు లేక ఉన్నవి అధ్వాన్నంగా కొన్ని, విరిగిపోయో స్థితిలో కొన్ని ఉన్నాయి. ఈ కార్యాలయానికి ముందు రెడ్ క్రాస్ వారి బిల్డింగ్ ఉన్నది. దీనిని రెడ్ క్రాస్ వారు మొదటి నుంచి వాడటం లేదు. ఈ తహశీల్దార్ కార్యాలయంలో అన్ని విభాగాల్లో, ట్రెజరరి కార్యాలయంలో పనులుండి వచ్చే వారు, ప్రత్యేకంగా యూరినల్స్‌కి వచ్చే వారు ఈ రెడ్ క్రాస్ బిల్డింగ్ చుట్టూ ప్రాంతాలను, ట్రెజరరీ, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ఉపయోగిస్తున్నారు. వర్షాలు పడితే విపరీతమైన దుర్వాసన వస్తోంది. ఇంత జరుగుతున్నా అటు తహశీల్దా ర్ కానీ, వారి కార్యాలయం సిబ్బంది కానీ, దగ్గరగా ఉండి అన్ని చూస్తున్న సబ్ ట్రెజరరీ సబ్బంది కానీ పట్టించుకోకపోవటం దురదృష్టకరమంటున్నారు. సెలవు రోజుల్లో ఈ కార్యాలయాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. ట్రెజరరి కార్యాలయం బూత్ బంగ్లాను తలపిస్తోంది. అన్ని కార్యాలయాలచుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, గేటును బాగుచేయిచి శుభ్రత గూర్చి తెలియచేసే బోర్డులని పెట్టాలని, విలువైన పత్రాలు ఉన్నందున రాత్రులు వాచ్ మెన్లను కాపలా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు


ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లు

'పేదలకు సేవ చేసేందుకే ఉచిత వైద్య శిబిరాలు'

ప్రజాశక్తి - క్రోసూరు


ఉచిత వైద్య శిబిరాన్న ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

వైద్యం ఖరీదైపోయిన నేటి రోజుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. మండల కేంద్రమైన క్రోసూరులోని జెడ్ పి హెచ్ స్కూల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పెదకూరపాడు నియోజకవర్గం లోనీ అన్ని మండలాల్లో బాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో కార్టూరి మెడికల్ కాలేజీ భాగస్వామ్యంతో మెడికల్ క్యాంప్ లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు మనిషి కి ఎంత డబ్బు ఉన్న ఆరోగ్యం సరిగ్గా లేకపోతే వారికీ ఎంత డబ్బు ఉన్న నిరూపయోగమే అన్నారు. నియోజకవర్గం లోని ప్రజల ఆరోగ్యం దఅష్టిలో ఉంచుకొని ఈ మెడికల్ క్యాంపు లు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ క్యాంప్ లో ప్రతీ మనిషికి అవసరమయిన జెనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, కంటికి సంబందించిన, ప్రసూతి వంటి అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ సుమారు 550 మందికి పరీక్షించినట్లు అన్నారు. పైగా వైద్య సేవలు ఉచితంగా పొందారన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేస్తామన్నారు. ఈ క్యాంప్ లో ఈసీజీ, ఎకో, అన్ని రకాల బ్లడ్ టెస్ట్ లు ఫ్రీ గా అందిస్తునారన్నారు నియోజకవర్గం ప్రజలు అవసరం అయిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవలన్నారు. మెగా క్యాంప్ కి అవసరమైన సౌకర్యాలను క్రోసూరు క్రోసూరు పంచాయతీ అధికారులు కల్పించారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మస్తాన్, ఇంచార్జ్ కార్యదర్శి ఆదినారాయణ బిల్లు కలెక్టర్లు ఆంజనేయ రెడ్డి మురళి , హనుమంతరావు, సహాయ సహకారాలు అందించారు. మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాంద్రు కాశయ్య, హసన్ దిద్దుల యోహాను, దూళ్ల సాంబశివరావు నల్లజాల కోటి, మన్నెం శ్రీను, తోక వెంకట్రావు, అనుముల వెంకటరామిరెడ్డి, వేగుంట రాణి శాఖమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం : ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల :

గతంలో జరిగిన పొరపాట్లు పునారవృతం కాకుండా అధికారులు, ప్రజల సహకారంతో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవాలయంలో నూతనంగా నిర్మించిన సదుపాయాలను ఎమ్మెల్యే ప్రారంభించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఉత్సవాల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎమెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ ఏఈ మాట్లాడుతూ గత తిరునాళ్ళలో మద్యం తాగిన యువకులు తమ డిపార్టుమెంట్ వారిపై దాడి చేశారని అటువంటివి జరగకుండా చూడాలన్నారు. తాగి అల్లరి చేసే వారి పట్ల కఠినంగా వ్యవరించాలని పట్టణ సిఐ ప్రభాకరరావును ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆర్డీవో మురళికృష్ణ, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఆలయ ఈవో పూర్ణచంద్రరావు, సిఐ ప్రభాకరరావు, ఎస్ఐ సంధారాణి, టిడిపి నాయకులు అక్కిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, సూరె యలమంద, మద్దిగపు చినవెంకట్రామిరెడ్డి, కంభంపాటి అనీల్, చిరంజీవిరెడ్డి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే రైతు సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఐక్య పోరాటాలతోనే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ఏపీ రైతు సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కెవీవీ ప్రసాద్ మాట్లాడుతూ నాగార్జున సాగర్ కాలువ కు రూ. 5వేల కోట్ల నిధులు కేటాయిచి ఆధునీకరించాలని కోరారు. వ్యవసాయానికి సాగునీటిని కల్పించ డంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉ న్నాయని ఆరో పించారు. మిర్చిని క్వింటా రూ. 20వేలకు తగ్గకుండా ప్ర భుత్వం కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ పథకాలకు 90 శాతం స బ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవాల్సి న బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందన్నారు. రైతుల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉద్యమిం చాల్సిన సమయం ఆసన్నమైందని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో ఉన్న ఎత్తి పోతల పథకాలకు నిధులు కేటాయించి, పునరుద్దరిం చాలని కోరారు. నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతు నల్లబార్లీ పొగాకు కూడా బోర్డు పరిధిలో చేర్చి గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూ రి బాబురావు, ఏఐవై ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి సిహెచ్ నిర్మల, వీసీకే పార్టీ నాయకులు వంజా ముత్తయ్య నాయకులు కందిమళ్ల వెంకటే శ్వర్లు,నాగేశ్వరావు, మల్లికార్జున్, సృజన్, కొండల్రావు, తుబాటి సుభాని తదితరులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కోమెరపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్, నూతనంగా మరమ్మతులు చేసిన ప్రభుత్వ పశువైద్యశాలను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యలర్తపాటి షేక్ జై బున్ బీ మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు టిడిపి నాయకులు యర్ర వెంకటేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, ఎపిడి పివీ నారాయణ కూటమి నాయకులు తదితరులు పాల్గన్నారు.

పసుపు మద్దతు ధర క్వింటాకు రూ.15 వేలు ప్రకటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పసుపు రైతులను ఆదుకునే విధంగా మద్దతు ధర క్వింటాకు 15 వేల రూపాయలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో పసుపు కల్లాలలోని పంటను పరిశీలించి, రైతులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ పసుపు వేసిన రైతులు ఈ వేసవికాలం వారం వ్యవధిలో రెండుసార్లు అకాల వర్షాలు కురవడంతో ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఇప్పటికే పసుపు పంటకు సరైన మద్దతు ధర ప్రభుత్వం ఇవ్వకపోవడం, అకాల వర్షాలతో రెండు సార్లు పసుపు పంట తడవడం రైతులకు అదనపు భారం పడిందని అన్నారు. ప్రస్తుతం క్వింటా పసుపుకు మద్దతు ధర 12 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. పెట్టుబడులు పెట్టి, పసుపు పండించిన రైతు కు తన రెక్కల కష్టం తప్ప మిగిలేది ఏమీ లేదని అన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన పసుపు కల్లాలలో ఆరబెట్టుకొని కటుకు వస్తుందని, రంగు మారుతుందని ఆందోళనలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే స్పందించి, క్వింటా మద్దతు ధర 15 వేల రూపాయలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, కొండా నాగి రెడ్డి, కుక్క మల్ల స్వామేలు, సుంకర శరత్ బాబు తదితర రైతులు పాల్గొన్నారు.



కుంచనపల్లిలో పసుపును పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జన్న శివశంకరరావు తదితరులు

పెట్టుబడి ఖర్చులు తప్ప పసుపు లాభసాటిగా లేదు

ఈ సంవత్సరం పసుపు వేసిన తనకు పెట్టుబడి ఖర్చులు తప్ప పసుపు పంట లాభసాటిగా లేదని, ఎం టి ఎం సీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన పసుపు రైతు కొండా నాగిరెడ్డి బుధవారం పసుపు పంటలు పరిశీలనకు వచ్చిన, పసుపు రైతు సంఘం నాయకుల వద్ద వాపోయారు. ఒక్కో ఎకరానికి లక్ష రూపాయల పైబడి పెట్టుబడి అవుతుందని, క్వింటా పసుపు 12000 మాత్రమే ఇస్తున్నారని ఆయన ఆవేదన చెందాడు. రెండు ఎకరాలు పసుపు వేసిన తనకు దిగుబడి కూడా సరిగా లేదని అన్నారు. మూల్గే నక్క మీద తాటికాయ పడ్డా చందాన సరైన గిట్టుబాటు ధర లేని పసుపు రైతుకు రెండుసార్లు అకాల వర్షాలు కురవడంతో కల్లాలలో తడిచిన పసుపును ఆరబెట్టేందుకు అదనపు ఖర్చులు అవుతున్నాయని ఆయన ఆవేదన చెందారు. పసుపు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం క్వింటాకు 15 వేల రూపాయలు ఇవ్వాలని గ్రామ రైతు నాగిరెడ్డి తెలిపారు.

- కొండా నాగిరెడ్డి, పసుపు రైతు, (కుంచనపల్లి)





జొన్నకొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తెనాలి

నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల పరిధిలోని నేలపాడు, కొల్లిపర మండలంలోని చక్రాయపాలెం గ్రామాలలో పర్యటించి అకాల వర్షాలకు దెబ్బతిన్న జొన్న పంటలను పరిశీలించారు. రైతులు ఆర్ మహేశ్వరరావు, గంపల నాగరాజు తదితరులను కలిసి నష్టపోతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారన్నారు. ఖరీఫ్‌లో 76 కేజీల ధాన్యం బస్తా రూ.1740కి అమ్ముకోవాల్సి ఉండగా, వర్షాల కారణంగా కేవలం రూ.1400 కు విక్రయించి నష్టపోయారన్నారు. ఆయన వెంట రైతులు బిల్లా కిషోర్, జెల్లి నాని తదితరులు ఉన్నారు.



నెహ్రూ నికేతన్ లిటిల్ వండర్స్ ప్రధమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక చెంచుపేటలోని నెహ్రూ నికేతన్ లిటిల్ వండర్స్ ప్రధమ వార్షికోత్సవం బుధవారం మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో జరిగింది. ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ పాల్గన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు లఘు నాటికలు, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలను దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా వేదికపై ప్రదర్శించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మారుతున్న విద్యా ప్రణాళికకు అనుగుణంగా విద్యాబోధన చేయడం, విద్యార్థులను విభిన్న ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న యాజమాన్యాన్ని అభినందించారు. మురళి కాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల కాన్వొకేషన్ నిర్వహించారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెఎల్‌యును సందర్శించిన యూనివర్సిటీ మలేసియా కేలాంటాన్ ప్రతినిధి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

యూనివర్సిటీ మలేసియా కేలాంటాన్‌లోని బయొటెక్నాలజీ విభాగానికి చెందిన డాక్టర్ ముహమ్మద్ బిన్ మన్సూర్ బుధవారం స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీని బుధవారం సందర్శించారు. కెఎల్ యూనివర్శిటీ లోని పరిశోధనా బఅందంతో చర్చలు జరిపారు. అనంతరం వారు కెఎల్ యూనివర్శిటీ లోని బయోటెక్నాలజీ చదువుతున్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు గల పరిశోధన శాలలు, పరిశోధిస్తున్న వైజ్ఞానికులను కలిగివున్న కేఎల్ యూనివర్సిటీతో పరిశోధన, పరస్పర సహకారం కోరుతూ తమ యాజమాన్యం ఇక్కడకు తమను పంపడం జరిగిందని డాక్టర్ ముహమ్మద్ అన్నారు. పరస్పర సహకారం కోరుతూ ఒక సుహఅద్భావ వాతావరణంలో జరిగిన చర్చల ద్వారా ఉమ్మడి పరిశోధనలు చేయాలని ఉభయులూ సంకల్పించుకున్నామని, త్వరలో ఒప్పందం చేసుకోవాలని ఉమ్మడి కార్యకలాపాలను విస్తృతం చేయాలని నిర్ణయించుకున్నామని బయో టెక్నాలజీ విభాగ అధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ రెండు యూని వర్శిటీల బఅందాలు కలిసి వివిద అంశాలపైన జరుపు తున్న పరిశోధనల సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెఎల్ యు అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, డైరెక్టర్ విజయ్ మారుతి, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రవీణ్ కుమార్, ప్రొఫెసర్ ఆరీఫుల్లా బయోటెక్నాలజీ విభాగపు ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



యూనివర్సిటీ మలేషియా కేలాంటాన్ ప్రతినిధి డాక్టర్ ముహమ్మద్ బిన్ మన్సూర్‌కు సత్కారం

యూపీహెచ్ సెంటర్లో మాతృత్వ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ గైనకాలజీ విభాగం వారి సహకారంతో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని మంగళగిరి గణపతి నగర్ ఇందిరానగర్‌లోని యుపిహెచ్‌సి సెంటర్లో బుధవారం నిర్వహించారు. ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థులు తల్లిపాలు బిడ్డకు ఎంత సురక్షితమో కళారూపం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా కాలేజీ ఆఫ్ నర్సింగ్ ఎయిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ ధనస్, యు పి హెచ్ సి డాక్టర్ పి అనూష మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు సంపూర్ణమైన పోషక ఆహారాలు కలిగిన రాగి పిండి, జొన్న పిండి, పాలు కోడిగుడ్లు, చికిస్ కలిగిన బ్యాగ్ ప్రతి నెలా అంగన్‌వాడీ సెంటర్లో పేరు నమోదు చేసుకోవటం ద్వారా ఉచితంగా పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ మంగళగిరి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓబిజీ విభాగం డాక్టర్ వందన, డాక్టర్ ఎం.ప్రియ, డాక్టర్ జి .కాలేశ్వరి, డాక్టర్ అరవింద్ జోషి, డాక్టర్ వికాస్, డాక్టర్ రాజీవ్ అరవిందక్షన్, డాక్టర్ ఆర్యన్, డాక్టర్ సత్య, సత్య సాయి ట్రస్ట్ డాక్టర్ రామారావు ఎయిమ్స్ జూనియర్ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్ యుపిహెచ్‌సి సెంటర్లో పౌష్టికాహారాన్ని అందజేస్తున్న డాక్టర్లు

వేసవి దుక్కులపై వ్యవసాయ విద్యార్థుల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పిస్తూ వ్యవసాయ విద్యార్థులు బుధవారం రూరల్ గ్రామం కొలకలూరు లో ర్యాలీ నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం, ఏరువాక బృందం సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత ఏరువాక సెంటర్ సీనియర్ సైంటిస్ట్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి ర్యాలీని ఉద్దేశించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వేసవిదుక్కులపై రైతులతో మాట్లాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ డాక్టర్ స్వర్ణలత, గ్రామానికి చెందిన రైతులు రోశయ్య, అప్పారావు, రామ్మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

అమరజీవి, ఉత్తమ కమ్యూనిస్ట్, భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప కమ్యూనిస్టు ఉద్యమకారుడు సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య కొనియాడారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని అమరజీవి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయం వద్ద గల చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి సిపిఐ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎ.ప్రభాకర్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నాగేశ్వరావు సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, జవ్వాది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : ఎర్రజెండా తొలి తరం నాయకుల్లో కమ్యూనిస్టు దిగ్గజంగా చంద్ర రాజేశ్వరరావు పేరుగడించారని సిపిఐ తాడేపల్లి మండల నాయకులు కె.కాశయ్య, ఎం.సుహాస్ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకొని బుధవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు మానికొండ డాంగే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.వెంకటయ్య, ఎం.రామారావు, ఎస్.కె.ఎం.ఖాసిం, ప్రసన్న కుమార్, ఎస్.కె.భాష, పాల్గొన్నారు.

కృష్ణా నదిలో దూకిన మహిళ - కాపాడిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి- తాడేపల్లి



కుటుంబ కలహాలు నేపథ్యంలో మేక దివ్య అనే మహిళ బుధవారం ప్రకాశం బ్యారేజీ మీద నుండి కశష్ణ నదులు దూకింది. పెద్దగా కేకలు వేయటంతో స్థానికులు వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది డ్రోన్లను పంపించి ఆయన సురక్షితంగా రోడ్డుకు చేర్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి - తెనాలి



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, బ్యాగ్ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ దార్ల అనిల్, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. ఎంఈఓ-2 వి జయంతి బాబు, ప్రధమ్ టీం గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ బెల్లంకొండ చక్రవర్తి, మనబడి-మన భవిష్యత్తు అసిస్టెంట్ ఇంజనీరు సిహెచ్.నాగేంద్ర పాల్గొన్నారు.

127 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు బుధవారం నాటికి 127 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎం శివకుమారి, ఈ సారమ్మ, టి దుర్గ భవాని, వై రమాదేవి, ఎం మరియమ్మ, కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. యాజమాన్యం, కార్మికులతో చర్చలు జరిపి సామరస్య పూర్వక వాతావరణం లో కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, టి నాగేశ్వరరావు, జి కొండయ్య, ఈ విశాలాంధ్ర, కె హగ్గయ్య, ఎస్.కె ఆరిఫ్, వై యహెూవా, ఎం శారద, యు రమణ, వి లక్ష్మి, డి బేబమ్మ, డి రమణ తదితరులు పాల్గొన్నారు.

25 నుండి కెఎల్‌పి స్కూల్లో వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో ఏప్రిల్ 25 నుండి మే 24వ తేదీ వరకూ అన్ని తరగతుల విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు స్కూల్ సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, అథ్లెటిక్స్, కోకో, పుట్‌బాల్, స్కేటింగ్, తైక్వాండో, కర్రసాము, చదరంగం, వెస్టర్న్ డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, సింటాక్స్ స్క్వాడ్ (ఇంగ్లీష్ ఈజ్ ఫన్) అంశాల్లో ఈ వేసవి తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకూ ఆయా అంశాలకు నిర్దేశించిన సమయం ప్రకారం ఈవెంట్లు జరుగుతాయన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు ఏప్రిల్ 20వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఇందు కోసం 0863-2350392, 9948227362 నంబర్లలో సంప్రదించాలన్నారు.

13న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ ఉంటుందన్నారు. 5వ తరగతికి సంబంధించి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో 21 అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2273 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంటర్‌కు సంబంధించి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొత్తం 21 కేంద్రాల్లో 2791 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు బ్లూ గానీ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ విధిగా తీసుకెళ్లాలని, పెన్సిల్, జెల్ పెన్నులు వాడకూడదన్నారు. హాల్ టిక్కెట్, ఆధార్ తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎస్సీలకు 75శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్‌కు 12శాతం, ఎస్టీలకు 6శాతం బిసి 5 శాతం, ఇతరులకు రెండు శాతం సీట్లు కేటాయించటం జరుగుతుందన్నారు. పరీక్ష హాల్ టిక్కెట్లలో తప్పులు ఉంటే పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను కలిసి సరైన ఆధారాలు చూపించి, సరిచేయించుకోవాలన్నారు.



పార్కును ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

దశలవారీగా చెరువులు, పార్కుల అభివృద్ధి

మంగళగిరిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి పార్కును ప్రారంభించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎస్ఎల్ఎన్ కాలనీలో అభివృద్ధి చేసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి పార్కు (ఎస్ఎల్ఎన్ పార్క్)ను మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. 0.35 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కును రూ.1.06 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా లోకేష్ స్థానికులతో మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా పార్కులు, చెరువులను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని టిడ్కోపార్కును రూ.9 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను కూడా ఈనెలలోనే ప్రారంభిస్తామని చెప్పారు. నులకపేట, చినకాకానిలో లేక్ పార్కులను కూడా అభివృద్ధి చేసి వాకర్స్‌కి అందుబాటులోకి తెస్తామని లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఆర్ ఎస్ అలీమ్ భాష, అడిషనల్ కమిషనర్ కే శకుంతల, ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు టి జానకి దేవి, రాష్ట్ర పద్మశాలి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చలపతి కాలేజీలో హ్యాక్‌ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న దర్శన్

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి, ఎస్ఎపి ల్యాబ్స్, నెక్స్ట్ గ్రిడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నేషనల్ లెవల్ హ్యాక్‌ఫెస్ట్-2025ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెక్స్ట్ గ్రిడ్ మేనేజర్ కె.దర్శన్, ఎస్ఎపి ల్యాబ్స్ రిక్రూటర్ మంజునాథ్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో సాప్ ఆవశ్యకతను వివరించారు. హ్యాక్ ఫెస్ట్‌లో పాల్గొని వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన 55 ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్‌లు, ఆలోచనలను పరిశీలించి, ఐదు ఉత్తమ ప్రాజెక్టులను తర్వాత రౌండ్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, విభాగాధిపతులు, డీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలి

విద్యాశాఖ అధికారుల సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రభుత్వ పాఠశాలల్లో రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ గతంలో కంటే ఎక్కువగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా విద్యాశాఖ అధికారి మండల విద్యా శాఖాధికారులు, ఐ.సి.డి.యస్ సూపర్‌వైజర్లు, విద్యా శాఖ అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 3 ఏళ్ల కంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో అడ్మిషన్లు 100 శాతం పూర్తి చేయాలన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలు ముగిసే నాటికి సమావేశాలు నిర్వహించుకుని లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఐసిడిఎస్ సిబ్బంది పిల్లల అడ్మిషన్ల విషయంలో సహకారం అందించాలన్నారు. బాల ఆధార యాప్‌లో పెండింగ్‌లో ఉన్న పిల్లల ఆధార్ వివరాలు త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. మదర్ అధార్‌లో తప్పులను సరి చేయాలన్నారు. ఆధార్ లేకుండా బర్త్ సర్టిఫికేట్ లు ఉన్న వారికి వెంటనే ఆధార్ కార్డులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జిఒ.117 అమలులో వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 2031 అంగన్ వాడీ కేంద్రాలలో 8517 మంది పిల్లలు ఉన్నారన్నారు. పదో తరగతి పరీక్షలు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించామన్నారు. స్పాట్ వాల్యుయేషన్ కూడా బాగా జరిగిందన్నారు. ఐ.సి.డి.యస్ పిడి ఉమా దేవి, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్న 7 వ పౌష్టికాహార పక్షోత్సవాల (పోషణ్ పఖ్వాడా) గోడ ప్రతిని ఆవిష్కరించారు.

గాయపడిన గర్భిణి, శిశువును కాపాడిన జిజిహెచ్ వైద్యులు

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వైద్యుల్ని అభినందిస్తున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గర్భిణీకి నాలుగు గంటలు శ్రమించి శస్త్ర చికిత్స చేసి తల్లి బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చించిన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ బుధవారం అభినందించారు. పెదపరిమి గ్రామానికి చెందిన నీలపు శివశంకరరావు శిరీష దంపతులు ప్రయాణిస్తున్న ఆటో గత నెల 24న తుళ్లూరు ఎమ్మార్వో ఆఫీసు వద్ద ప్రమాదానికి గురైంది. డెలివరీకి సిద్ధంగా ఉన్న శిరీష ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వెంటనే ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లేబర్ వార్డుకు శిరీషను చూసిన వైద్యులు బాగా కంగారు పడ్డారు. ఆమెకు బాగా గాయాలు అయ్యాయని, ఆమెతో పాటు కడుపులో శిశువుకు కూడా ప్రమాదం ఉందని అప్పటికప్పుడు అధునాతన వైద్య పరిజ్ఞానంతో ఆపరేషన్ చేసి ఆడ శిశువును బయటకు తీశారు.ఇంత క్లిష్టమైన ఆపరేషన్ ని మొత్తం నాలుగు విభాగాల డాక్టర్లు కలిసి కంబైన్డ్ ఆపరేషన్ ద్వారా తల్లి బిడ్డను కాపాడడం జరిగిందని డాక్టర్ రమణ తెలిపారు. ఇదే ఆపరేషన్ ప్రైవేట్ ఆస్పత్రిలో అయితే 10 లక్షల పైనే వ్యయం వరకు వైద్య ఖర్చులు అవుతాయన్నారు. ప్రసూతి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష, జనరల్ సర్జరీ విభాగం నుండి డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ వినయ్, అందే కోటి వెంకటేశ్వర్లు, డాక్టర్ పోలయ్య, నాగభూషణం తదితరులు ఈ శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు. దాదాపు 15 రోజుల తరువాత బుధవారం శిరీషను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. శిరీష దంపతులు, కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

ఇస్రో యువికా యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు గుంటూరు జిల్లా నుండి ముట్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్.పవన్ దుర్గ, డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి వి.సోమశేఖర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను బుధవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అభినందించారు. దేశ వ్యాప్తంగా మూడున్నర లక్షల మంది పోటీ పడిన ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావటం గర్వకారణం కలెక్టర్ పేర్కొన్నారు. మే 18 నుండి 31వ తేదీ వరకూ శ్రీహరికోట షార్ కేంద్రంలో జరిగే యువికా యంగ్‌సైంటిస్ట్ ప్రోగ్రామ్‌లో ఈ ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని డిఇఒ సి.వి.రేణుక తెలిపారు. ఈ కార్యక్రమంలో ముట్లూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జోస్ మేరీ, సైన్స్ ఉపాధ్యాయులు రామాంజనేయులు, శ్రీనివాస్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులో ట్రాఫిక్ సమస్యలపై ఎస్‌పి సతీష్‌కుమార్ క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్, కింగ్ హోటల్ సెంటర్, ఎన్‌టిఆర్ సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్, పూల మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో స్వయంగా కాలినడకతో ప్రయాణించి ట్రాఫిక్ సరళిని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి..?, ఎవరి వలన వస్తున్నాయి..?, ఏయే సమయాల్లో వస్తున్నాయి..? ట్రాఫిక్ సమస్యలకు గల తెలుసుకున్నారు. ఎస్‌బి డిఎస్‌పి బి.సీతారామయ్యకొత్త పేట సిఐ వీరయ్య చౌదరి, ఈస్ట్ ట్రాఫిక్ ఎస్సై విజయకుమార్ రెడ్డితో ట్రాఫిక్ సమస్యల గురించి చర్చించి, పోలీస్ శాఖ తరపున ట్రాఫిక్ సమస్యల నివారణకు మున్సిపల్, రోడ్లు రవాణా అధికారులు, రోడ్లు మరియు బిల్డింగ్ శాఖా అధికారులతో చర్చించి, తగిన ప్రణాళికలను రూపొందించి, వేగంగా పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే తగు చర్యలు తీసు కుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమి షనర్ శారదాకాలనీ, దుర్గా నగర్, బస్టాండ్, ఓల్డ్‌క్లబ్‌రోడ్, గోరంట్ల, అమరావతి రోడ్ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య పనుల మెరుగుదల కోసం తగిన కార్మికులు, పుష్‌కాట్స్, వాహనాలు అందించామని, అయినప్పటికీ కొందరు కార్యదర్శులు, ఇన్స్పెక్టర్ల పనితీరులో మార్పు లేదని అన్నారు. శారదా కాలనీ, దుర్గానగర్ ప్రాంతాల్లో రోజు ఇంటింటికి చెత్త సేకరణకు కార్మికులు రాని కారణంగా రోడ్ల మీద వ్యర్థాలు వేస్తున్నామని తెలపటంతో సంబంధిత ఇన్స్పెక్టర్ పాలపర్తి వెంకటేశ్వర్లుని తక్షణం అక్కడి నుండి బదిలీ చేయాలని సిఎంఒహెచ్‌ని ఆదేశించారు. పర్యటనలో సిఎంఒహెచ్ డాక్టర్ అమృతం, ఎస్ఎస్ జె.ఐజాక్, టిపిఎస్ లు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



శారదా కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్